కథా నిలయం
శ్రీకాకుళం

# వేదభూమి

భోజనం బల్ల ముందు కూర్చుని ఇంత గంధం బొట్టు, దానిమీద ఇంత కుంకం బొట్టు దిద్దుకొని, కంచం ముందుకు లాక్కుని కూర్చున్నారు కృష్ణశర్మగారు. ఐదు నిమిషాలైనా భార్య వచ్చి వడ్డించక పోవడంతో ఆవిడ మీద ఆయనకి తిక్కకోపం వచ్చింది.

"వర్ధనం, కంచం ముందు కూర్చుని ఐదు నిమిషాలైంది. ఇంత పిండాకూడు తగలేస్తావా" – అరిచారాయన.

వర్ధనమ్మ పెరట్లోంచి పచ్చడి గిన్నెతెస్తూ "అయ్యో ఏమిటా కేకలు, మీరేగా నోరు చచ్చిపోయింది, యింత కరివేపాకు పచ్చడి నూరమన్నారు. కాస్త లేత కరివేపాకు కోసి, రెండు ఎండుమిరపకాయలు, చింతపండు, జీలకర్ర, ఇంగువవేసి నూరుకొస్తున్నాను గ్రైండరులో చేస్తే తినరని.. ఈలోగా పిండాకూడు అంటూ అరుస్తారా, అవ్వ, శుక్రవారంపూట ఏమిటామాటలు" – వంటింట్లోంచి వంటగిన్నెలు టేబుల్ మీద పెడ్తూ అంది.

"వడ్డించి, తగలడు – " నీరసంగా అరిచారాయన.

పోపులో వేసిన బీరకాయ కూర, పెసరకట్టు పచ్చడి వేసి వేడన్నం వడ్డించి నెయ్యి వేసింది. ఔపోసనపట్టి ఆబగా కూరతో నాలుగు ముద్దలు తిని పచ్చడి కలుపుకున్నారు. వేడన్నంలో నేయి వేసి పచ్చడి కలిపి నోట్లో పెట్టుకోగానే జిహ్వా లేచివచ్చింది. కడుపులో నాలుగు ముద్దలు పడగానే ఆత్మారాముడు శాంతించాడు.

"పచ్చడి పుల్లపుల్లగా బాగుందే. ఎలాగైనా నీ చేతిలో వుందే రుచి" గబ గబ ముద్దలు తింటూ అన్నారాయన.

వర్ధనమ్మ మూతి తిప్పింది.

"అదిగో పసుపు ఇదిగో ముసుగు మీ వ్యవహారం అంతా. కోపం వచ్చినా, సంతోషం వచ్చినా పట్టలేం – పిండాకూడు అని తిట్టారుగా" – అలక గొంతుతో అని తన కంచంలో వడ్డించుకుని కూర్చుంది.

"నీరసమే – నాలుగు రోజుల జ్వరం – ఆ దిక్కుమాలిన మాత్రలు కలిసి శక్తి లాగేసింది. ఆకలికి పిచ్చ కోపం వచ్చింది" సంజాయిషీ యిస్తూ చారన్నం కలుపు కున్నారు.

"బాగుందే ఇంగువచారు, పుల్లగా తియ్యగా కమ్మగా వుంది" "అమెరికా ప్రయాణం వుంది. జ్వరపడ్డారు. తగ్గుతుందా అని భయపడ్డాను."

"ఇంకా పదిరోజుల టైముందిగా. పోయిన శక్తి వచ్చేస్తుంది – ఇంకనీ పచ్చళ్లు పొడులు సర్దుడు మొదలుపెట్టు, ఆఖరివరకు పెట్టావంటే హడావిడి అయిపోతుంది" – మజ్జిగ కలుపుకుంటూ అన్నారాయన.

"ఆ తెలుసులెండి. కందిపొడుంకి పప్పులు వేయించి పెట్టి – కరివేపాకు పొడి నువ్వులపొడి, అన్నీ ఎంతసేపు గ్రైండరులో వేస్తే నిమిషం పని. చింతకాయ, పండుమిరపకాయల పచ్చడీ, గోంగూర, కాకరకాయ, నిమ్మకాయ, టమోటా పచ్చడి చేస్తాను. వాడికి అమెరికా వెళ్ళినా మన తెలుగు వంటంటే ప్రాణం. కాస్త గుమ్మడి వడియాలు, పేలాల వడియాలు కావాలన్నారు."

"ఏం చేస్తావో, ఏమేమి పట్టుకెళతావో లిస్టు తయారుచెయ్యి మనవి నాల్గు పెట్టెలు, రెండు షోల్డర్ బ్యాగులు... ఒక్క కేజి బరువెక్కువైనా బోలెడు డబ్బులు కట్టాలి. అది గుర్తుపెట్టుకుని పెట్టెలు సర్దు. పిల్లలకి బట్టలన్నావు. సునీత సి.డిలడిగింది. పుస్తకాలు తీపి, కారం, టిఫిన్లు అన్నీ కలిపి తడిసి మోపెడు అవుతాయేమో!"

"అబ్బ, మీరూరుకోండి, అన్నీ సరిగా సర్దితే సరిపోతాయి. ఎప్పుడో ఓసారి వెళ్ళేవాళ్ళం పిల్లల కోసం అన్నీ పట్టుకెళ్ళకపోతే ఎలా – అప్పుడంటే వేణుకి పెళ్ళి, పిల్లలు లేరు గనగ కొద్దిగా పట్టుకెళ్లాం. వాడి పెళ్లి, పిల్లలు పుట్టాక మొదటిసారి వెడ్తున్నాం.." – వర్ధనమ్మ అంది.

"ఈ ఏడాది బోస్టన్‌లో చలి ఇంకా బాగా ఎక్కువగానే ఉందంటూ జూన్ వచ్చినా.. కొద్దిగా ఉలెన్స్ తెచ్చుకోమన్నాడు వేణు – కెట్స్ కూడా కొనాలి – నీకు."

వెళ్ళబోయే అమెరికా ప్రయాణం ముచ్చట్లు ఆడుకుంటూ భోజనం ముగించారు ఆ దంపతులు.

* * * * * *

న్యూయార్క్‌లో విమానం దిగి యిమిగ్రేషన్ చెకప్ ముగించుకుని బయటపడేసరికి గంటన్నర పట్టింది - సామాను ట్రాలి తోసుకుంటూ బయటికి వచ్చేసరికి వేణు ఆరాటంగా ఎదురు చూస్తున్నాడు.

"అబ్బ, ప్లేను లాండ్ అయి గంటన్నర అయింది. ఇంత ఆలస్యం అయిందేం నాన్నగారు."

"క్యూలురా బాబూ, యిమిగ్రేషన్ దగ్గిర, సామాను రావడం గంటలు గంటలు, మూడు విమానాలు ఒకేసారి లాండ్ అయ్యేసరికి ఒకటే జనం ఒకటే క్యూలు - "

సామాను కారులో సర్ది బయలుదేరేసరికి మరో గంట.

"అమ్మయ్య ఏం ప్రయాణంరా నాయనా, కాళ్లు పచ్చుడయ్యాయి. పద్దెనిమిది గంటలు విమానంలో. ఎయిర్‌పోర్టులో గంటలు గంటలు క్యూలో..."

"అదేనమ్మా అమెరికా ప్రయాణం అంటే - మమ్మల్ని రాలేదు రాలేదు అంటావు ప్రతీ ఏడాది. ఎంత కష్టం, ఎంత డబ్బు ఖర్చు పెట్టి రావాలీ చూశావుగా" - కొడుకన్నాడు - "ఇక్కడ నుంచి ఇంక మూడు గంటలుపైన ప్రయాణం వుంది బోస్టన్‌కి" - కారు నడుపుతూ అన్నాడు. తోవ పొడుగునా విశేషాలు, ఊరుపేర్లు, బిల్డింగులు, రోడ్లు గురించి డ్రైవ్ చేస్తూ చెప్తున్నాడు వేణు.

బ్యాచిలర్‌గా ఉండగా న్యూజెర్సీలో ఉన్నప్పుడు వచ్చాక పదేళ్ళకి మళ్ళీ రావడం ఇదే. పెళ్ళయ్యాక ఉద్యోగం మారి బోస్టన్‌లో ఉంటున్నాడు వేణు. మొదటిసారి మనవడు పుట్టాక వచ్చారు. మనవరాలు పుట్టాక వాళ్ళే వచ్చారు. పురుళ్ళకి వియ్యపురాలు వెళ్ళేది. కృష్ణశర్మగారు ప్రతీసారి ఏదోవంక పెట్టి వెళ్ళకుండా నెట్టుకొచ్చేవారు. మీరే రండి మావల్లకాదు అనేవారు. ఇపుడు పిల్లల చదువులు వచ్చాక ఇంక మేం తరచు రాలేం. నాల్గు టిక్కెట్లు. మీరే రావాలి అంటూ టిక్కట్లు పంపి బలవంతం చేస్తే బోస్టన్ ప్రయాణం పెట్టుకున్నారు ఈసారి తప్పక.

"ఏం రోడ్లురా వేణు... ఈ రోడ్లు చూస్తేనే కడుపు నిండిపోతుంది. ఎంత శుభ్రంగా ఉన్నాయో" సంబరంగా చూస్తూ అంది - మొదటిసారి వచ్చినపుడయితే తల్లి చిన్న

పిల్లలా ఆ ఎయిర్‌పోర్టులు, రోడ్లు, ఆహైవే బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు, ఆ కార్లు చూస్తూ సంబరపడిపోవడం, ఆశ్చర్యపడిపోవడం వేణుకింకా గుర్తుంది.

"ఇప్పుడు ఇండియాలోనూ హైవేలు ఆరులైన్లు, నాల్గు లైన్లు వేస్తున్నారు. ఫ్లై ఓవర్లు కడ్తున్నారు. కాని ఈ నాణ్యత ఎక్కడుంది... అక్కడ విపరీతంగా కార్లు పెరిగాయి. ట్రాఫిక్ జామ్‌లు వచ్చాయి. ఇలా పకడ్బందీగా ట్రాఫిక్ ఎక్కడుంది" - కృష్ణశర్మగారన్నారు.

"నాన్నగారు - మనవాళ్ళు రోడ్లు వేస్తారు గాని మెయిన్‌టెనెన్స్ ఏది - వేసిన నాల్గు రోజులకే ఓ వర్షం కురవగానే కంకర తేలుతుంది. ఇక్కడ ప్రతీ ఏడాది వింటర్ పూర్తికాగానే రోడ్ల మరమ్మత్తులు క్రమం తప్పక చేస్తారు."

"చెప్పకురా మన దేశం గురించి - రోడ్లమీద పెట్టే డబ్బులో పాతిక వంతు రోడ్డుకి చేరుతుంది. మిగతాది కాంట్రాక్టర్లు, ఆఫీసర్లు, రాజకీయనాయకుల జేబుల్లోకి. ఎక్కడ చూసినా అవినీతి. డబ్బు తినడం తప్ప ఎవరికి ఏం పట్టదు. అందుకే ప్రతి డిపార్ట్‌మెంటు అలా ఏడుస్తుంది" - విరక్తిగా అన్నాడు కృష్ణశర్మ.

కబుర్లు చెప్పుకుంటుండగానే ప్రయాణం చేసినట్టే అనిపించకుండా మూడు గంటల్లో బోస్టన్ చేరింది కారు.

పిల్లలు, సునీత కారు దగ్గిర కొచ్చారు.

"నమస్కారం అత్తయ్యగారు మామయ్యగారు" కన్నడ అమ్మాయి సునీత తెలుగు పట్టి పట్టి మాట్లాడుతుంటే తమాషాగా అనిపిస్తుంది. పిల్లలిద్దరూ కాస్త దూరంగా నిలబడి చూస్తుంటే వర్ధనమ్మ ముందుకు వెళ్ళి పిల్లలిద్దర్ని చెరో చేత్తో దగ్గరికి లాక్కుంది. "శరత్, శ్రావణీ మామ్మని గుర్తున్నానా" అంటూ పలకరించి, "సునీతా బాగున్నావా, ఈరోజు ఆఫీసు కెళ్ళవా" పలకరించింది.

"ఇప్పుడే వచ్చానత్తయ్యా.. రండి లోపలికి"

అందరూ తలో సామాను మోసుకు లోపలి కెళ్లారు.

నాల్గు పడకగదుల ఇల్లు. ఆ ఫర్నీచర్, పరదాలు, తివాచీలు అలంకరణ సామాగ్రి అన్నీ అబ్బురంగా చూస్తూ గదులన్నీ ఓసారి తిరిగి వచ్చింది. "ఇల్లు బాగుందిరా కిందటి మాటు ఫ్లాట్ కంటే ..." అంది.

"బాగుంది అది అద్దె అపార్ట్‌మెంటు - ఇది స్వంత ఇల్లు..." - భార్య అమాయకత్వానికి నవ్వి అన్నారు కృష్ణశర్మ.

"పదండి నాన్నా, మీ గది చూపిస్తా... ఫ్రెష్ అయి వస్తే భోంచేద్దాం ..." అన్నాడు వేణు.

కోడలు ఫ్రిజ్ తెరచి ఏవేవో జిప్ బ్యాగులు తీసి టేబుల్‌మీద పెడ్తోంది.

"ఏమిటమ్మా ఇప్పుడు వండాలా – పొద్దుట కొన్ని చేసి పెట్టుకోకపోయావా –" అంది వర్ధనమ్మ.

"అబ్బే అక్కరలేదత్తయ్యా ... అన్నీ ఉన్నాయి. సాంబారు గడ్డ బయటపెట్టా, దొండకాయ కూర తింటారా, వంకాయ కొత్తిమీర కారం కూర తింటారా!" – ఐసు కట్టిన జిప్‌లాన్ బ్యాగులు చూపిస్తూ అడిగింది. "రాత్రి వంకాయ వద్దులే, దొండకాయ చెయ్..." అంది. రెండు బ్యాగులు ఫ్రిజ్‌లోంచి తీసి, రైస్ కుక్కర్ ఆన్‌చేసి, "మీరెళ్ళి స్నానం చేసిరండి. ఈలోగా అన్నీ వేడి చేస్తా" అంది కోడలు.

కొడుకు వెంట వెడ్తున్న కృష్ణశర్మ "సాంబారుగడ్డ" అన్నమాట విని వెనక్కి తిరిగి టేబిల్ మీద గడ్డకట్టిన బ్యాగులు చూసి భార్య వంక ఆశ్చర్యంగా చూశారు... కొడుకు తండ్రికి గది చూపి వేడి, చన్నీళ్ళ ట్యాపులు తువ్వాళ్లు అవి చూపించి క్రిందికి వెళ్ళాడు.

"ఏమిటే సాంబారు గడ్డేమిటి, కొంపదీసి ఆ సాంబారు పెడ్తుందా కరిగించి – "

"ఊరుకోండి, అబ్బాయి వింటాడు. సాంబారు ఫ్రీజరులో ప్లాస్టిక్ బ్యాగుల్లో పెట్టినట్లుంది. గడ్డకట్టింది – ఆ అమ్మాయికి తెలుగు సరిగా రాదు కదా సాంబారు గడ్డ అంది... వీళ్లు వారం పదిరోజులకి ఓసారి వండిపెట్టుకుంటారుగా..." – వర్ధనమ్మ వివరించింది.

"ఖర్మ, రేపు ఇడ్లీ గడ్డలో, ఉప్మాగడ్డలో టిఫినుకి పెడ్తుంది కాబోలు. ఇదిగో ఆ ఐసు గడ్డల కూరలు నేను తినలేనుగాని రేపటి నుంచి నీవు వంటచెయ్యి మనం ఉన్నన్ని రోజులు..." – నసుగుతూ అన్నారు.

"ఎక్కడ కొచ్చినా – సర్దుకోరు. మీ పెళ్ళాంలా ప్రతి పూట వేడిగా వండి వార్చడానికి వీళ్ళకి తీరిక ఎక్కడ. మీ సణుగుడు కాస్త మాని సర్దుకోండి..." – లోగొంతుతో అంది.

"అందుకే నేనీ అమెరికా రాను మొర్రో అంటాను..." – గొణుక్కున్నారాయన.

డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చోగానే ఆయన మొహం అప్రసన్నమైంది. మైక్రో

ఓవెన్ నించి వేడిచేసి కోడలు ఒక్కొక్క డిష్ పైన పెడ్తుంటే భార్య వంక మిర్రి మిర్రి చూశారు. ఇటు అటు కెలికి ఆఖరికి పెరుగు వేసుకుని భోజనం అయిందనిపించి లేచారాయన. కోడలు వంటింట్లో గిన్నెలు కడుగుతూంటే వర్ధనమ్మ, "వేణూ, నేను వచ్చాగా, రేపటి నుంచి నేను వండుతాను. మీ నాన్న సంగతి తెలుసుగా - మడిగా ఏ పూట వండింది ఆ పూటే తింటారు. వంటపని నేను చూసుకుంటానని సునీతకి నీవే చెప్పు. తను ఏమి అనుకోకుండా" - లోగొంతులో కొడుకుతో అంది వర్ధనమ్మ.

వేణు అర్థమైనట్లు తల ఊపాడు - పడక గదిలోకి వెళ్లాక, "నీకింక వంటకి ఓ నెల సెలవు. రేపటి నించి మా అమ్మ వండుతుంది. మా నాన్నకి మడి అది వుంది. ఆవిడకి రేపు వంటింట్లో అన్నీ చూపించి ఆవిడకి కూరలు తెచ్చి యియ్యి" అని భార్య నొచ్చుకోకుండా చెప్పాడు.

మర్నాడు ఆదివారం. అందరూ లంచ్‌కి కూర్చుంటే వర్ధనమ్మ వేడివేడిగా అందరికి వడ్డించింది. బీరకాయ పప్పుకూర ఇంగువ నూనెవేసి, వంకాయ పులుసు పచ్చడి, కొత్తిమీర పచ్చడి, చారు పెడితే చాలా రోజుల తర్వాత తల్లి చేతి వంట ఫ్రెష్‌గా, వేడివేడిగా తింటుంటే అమృతంలా అనిపించింది వేణుకి. కోడలు కూడా మనస్ఫూర్తిగా మెచ్చుకుంటూ తింది. మనవలు కాస్త కారం అంటూ పప్పుకూరతో, చారుతో తిన్నారు.

"మీలా నాకు అన్నిరకాల వంటలు రావత్తయ్యా" - నిజాయితీగా అంది సునీత.

"అమ్మా, పెద్ద చదువులు చదివి పెద్ద ఉద్యోగం చేస్తున్నావు. అది గొప్ప - వంటదేం ఉంది. నాలాంటి వాళ్ళు చెయ్యాల్సిన పని యిది" - వర్ధనమ్మ కోడలుతో ఆప్యాయంగా అంది.

తాతగారు అన్నం తినేముందు కంచం చుట్టూ నీళ్ళు తిప్పి ఔపోసన పట్టడం చూసి శరత్ తండ్రి చెవులో గుసగుసలాడాడు.

"ఏమిట్రా మనవడా నామీద ఏం చెప్తున్నావు మీ నాన్నకి ..." తాతగారు హాస్యం ఆడారు.

"మీరు అలా కంచం చుట్టూ నీళ్లెందుకు తిప్పారని సందేహం వచ్చింది వాడికి."

"అదా! అవును మరి మన ఆచార వ్యవహారాలు చెప్పందే పిల్లలకి ఎలా తెలుస్తాయి? దూరంగా విదేశాల్లో ఉన్న పిల్లలకి ఇవన్నీ ఎలా తెలుస్తాయి? ఇవన్నీ ఎలా చూస్తారు?"

"విదేశాలెందుకు నాన్న, మనదేశంలో ఉన్నవాళ్లెందరు ఈ ఆచార వ్యవహారాలు పాటిస్తున్నారా ఇప్పుడు, ఏదో మీలాంటి పాతతరం ఒకరిద్దరు తప్ప."

"నిజమేలే నీ వన్నది. చూడు బాబూ శరత్ – ఈ ఆచార వ్యవహారాలు నీకిప్పుడు చెప్పినా సరిగా అర్థం కావు కానీ, ఇలా చేయడం వెనక పెద్దలు ఈ ఆచారం ఎందుకు పెట్టారో నీకర్థమయేట్టు చెప్పనా – ఇదివరకు రోజుల్లో మేం కింద కూర్చుని, అరిటాకు వేసుకుని భోంచేసేవాళ్లం. నేలమీద చీమలు, చిన్న కీటకాలు, సూక్ష్మజీవులు విస్తర్లకి పాకి రాకుండా విస్తరి చుట్టూ నీళ్ళు తిప్పితే ఆ నీళ్ల దాటి చీమలు లాంటివి రాలేవు గదా – తరువాత ఉద్ధరిణితో చేతిలో నీళ్లు పోసి వదలడం అంటే చేయి కడుక్కోవడం, నోట్లో నీరు పోసుకోవడం అంటే ఔపోసన – అంటే ఎండిన గొంతుని తడిపితే అన్నం ముద్ద సుళువుగా జారుతుందని ఇలా ఆచారం అంటూ పెట్టారేమో! మనవాళ్ళు అలా పెట్టిన ప్రతి ఆచారం వెనక ఓ సైంటిఫిక్ రీజను వుండేది కాని అలా ఎందుకు చెయ్యాలో చెప్పేవారు కాదు సరిగా. దాంతో ఈ ఆచారాలన్నీ కొట్టిపారేసారు మనవారు. రోడ్లన్నీ తిరిగి వచ్చిన కాళ్ళతో ఇంట్లోకి రాకుండా గుమ్మం ముందు నీళ్ళు పెట్టి కడుక్కుని రమ్మనేవారు. మా చిన్నతనాన చెప్పులుండేవి కావు. అలాగే గుమ్మం ముందు పేడనీళ్లు జల్లడం, ముగ్గు, గడపలకి పసుపు రాయడం అన్నింటి వెనక ఆరోగ్య రహస్యాలుండేవి."

శరత్ తాతగారి మాటలు శ్రద్ధగా విన్నాడు.

"డాడీ ఎప్పుడూ చెప్పలేదు నాకు –"

"నాకు తెలిస్తే కదా నీకు చెప్పడానికి మాన్న నాకెప్పుడూ చెప్పలేదు మరి" – వేణు నవ్వుతూ అన్నాడు.

"కృష్ణశర్మ నవ్వి, నీకంటే నీ కొడుకు నయం. తెల్సుకోవాలన్న జిజ్ఞాస ఉంది వాడికి..."

"నాన్నగారు... మీరున్నన్ని రోజులు పిల్లలకి కాస్త తెలుగుపదాలు, శతకాలు చెప్పి అర్థం చెప్పండి. ఇలాంటి ఆచార వ్యవహారాలు, వాటివెనుక ఉన్న విజ్ఞానం చెప్పండి వాళ్ళకి" అన్నాడు వేణు.

* * * * * *

"నాన్నగారూ ఇతను మైఖేల్... నా కొలీగ్. మిమ్మల్ని కలవాలని, మీతో కొన్ని

విషయాలు చర్చించాలని వచ్చాడు" - వేణు తండ్రితో అన్నాడు. మూడు రోజుల తర్వాత ఆఫీసు నించి స్నేహితుడిని వెంటబెట్టుకుని వచ్చి తండ్రికి పరిచయం చేశాడు.

కృష్ణశర్మ అతను చాపిన చేయి అందుకుని కరచాలనం చేసి, "నాతోనా" అన్నారు ఆశ్చర్యంగా.

"ఆ, ఇతనికి మన హిందూ సాంప్రదాయాలు, భారతీయ సంస్కృతి, మన వేదాలు, పురాణాలు బాగా తెలుసు. ఆధ్యాత్మిక పుస్తకాలెన్నో చదివాడు. ఇండియా రెండుసార్లు వెళ్లి హరిద్వార్, బదరీనాథ్‌లలో పదిహేను రోజులుండి, యోగా, మెడిటేషన్ అవి నేర్చుకుని వచ్చాడు - మన రామాయణ భారతాలు చదివాడు. మీకు ఇంగ్లీషు, సంస్కృతం, తెలుగు అన్నీ బాగా వచ్చు. పురాణేతిహాసాలు చదివారు. అతనడిగిన సందేహాలని మీరు ఇంగ్లీషులో విడమర్చి చెప్పగలరు - మీరిద్దరూ మాట్లాడుతూ ఉండండి. నేను ఫ్రెష్ అయి వస్తాను - " అని వేణు లోపలికి వెళ్లాడు.

మైఖేల్ నవ్వుతూ తనని తాను పరిచయం చేసుకుని తనకి భారత దేశం ఎందుకు నచ్చిందో, వేదాలలో సారం, హిందువుల ఆచార వ్యవహారాలు, తాను చూసిన ప్రదేశాలు, తాను చదివిన పుస్తకాలు, తాను చూసిన స్వాములు, మఠాలూ... తనకి నచ్చిన యోగా, మెడిటేషన్ అన్నీ చెప్పాడు.

"సంతోషం బాబూ, మావాళ్ళకంటే నీవు ఎక్కువ చదివావు. మా గురించి మా కంటె గొప్పగా అర్థం చేసుకున్నాడు - నేనేం పెద్ద పండితుడిని కాను. నీకు చెప్పతగ్గ అర్హత నాకుందని నేననుకోవడం లేదు... ఇన్ని తెలిసిన నీవు ఇంకా నాతో చర్చించేదేం ఉంది" - ఆశ్చర్యంగా అన్నాడు కృష్ణశర్మ.

"అలా అనకండి సార్ - మీరు పెద్దలు. నాది పుస్తకానుభవం. మీది స్వానుభవం. నాకు కొన్ని సందేహాలు నివృత్తి చెయ్యాలి. పాపపుణ్యానికి మీరిచ్చే నిర్వచనం, జనన మరణాలు, మీ హిందువుల విశ్వాసాలు, భారత, భాగవత, రామాయణాల్లో సందేహాలు కొన్ని తీర్చాలి..."

"తప్పకుండా అడుగు, నాకు తెలిసినవి నిరభ్యంతరంగా చెపుతాను. చిన్నప్పుడు మా నాన్నగారు క్రమశిక్షణతో దగ్గరుండి సంస్కృతం నేర్పించారు. పురాణాలు చదివించారు. వాటివల్ల కాస్త జ్ఞానం అబ్బింది. నాకు తెలిసింది ఇంకొకరితో పంచుకోవడం నాకు ఆనందమే!"

వేణు బట్టలు మార్చుకురాంగానే మైఖేల్ ప్రశంశాపూర్వకంగా, "వేణూ మీ నాన్నగారు ఎంత మంచి ఇంగ్లీషు మాట్లాడుతున్నారు -" అన్నాడు.

"ఆయన ఇంగ్లీషు రీడరుగా యూనివర్సిటీలో పనిచేసి రిటైరయ్యారు తెలుసా. ఆయన బ్రిటిష్ వారి టైములో  చదివిన చదువు మరి – "

మైఖేల్ వినయంగా, "సార్, నాలాగే నా స్నేహితులిద్దరికి ఈ విషయాల మీద చాలా ఇంటరెస్ట్ – రేపు వారిని తీసుకువస్తే మీకేమన్న అభ్యంతరమా" అనడిగాడు.

"తప్పకుండా, అభ్యంతరానికి ఏముంది" తండ్రి తరఫున వేణు అన్నాడు.

"ఎన్ని గంటలకి రమ్మంటారు. మీ సమయం చెపితే..."

"నాన్నగారు ఎనిమిది గంటలకి డిన్నరు తీసుకుంటారు. మీరు ఆరు గంటలకి వస్తే ఓ రెండు గంటలు మాట్లాడుకోవచ్చు..." వేణు అన్నాడు.

మైఖేల్ శలవు తీసుకు వెళ్లాక, "ఏమిటి నేను ఏం చెప్పాలి – ప్రవచనాలు చెప్పాలా షణ్ముఖశర్మలా" నవ్వుతూ అన్నారు.

"అలాగే అనుకోండి – ఏదో ఒక సబ్జెక్ట్ మీద మాట్లాడండి. లెక్చర్లు ఇవ్వడం మీ కలవాటేగా – వాళ్ళడిగిన ప్రశ్నలకి జవాబిచ్చింది – సాయంత్రాలు మీకు మంచి కాలక్షేపం వుంటుంది" – వేణు నవ్వుతూ అన్నాడు.

* * * * * *

ఏ ముహూర్తాన మొదలుపెట్టారోగాని కృష్ణశర్మ ముందు రోజే పెద్ద సక్సెస్ అయిపోయారు. ఆయన భాష, భావం, ఆశువుగా అలా ఒకదాన్లోంచి ఓదాన్లోకి, అసలు కథల్లోంచి పిట్టకథల్లోకి, పురాణాల గురించి, వేదాలు, ఆచారాలు, శతకాలు, పూజ పునస్కారాలు, పండగలు, జనన మరణాలు – ఇలా ఆయన సృజించని వస్తువే లేదన్నట్టు పురాణ కాలక్షేపంలా నెల రోజులు ఏకధాటిగా రామాయణ, భారత, భాగవతాల ముఖ్య ఘట్టాలు, యోగ, మెడిటేషన్, మన ఆయుర్వేద విశిష్టత – అడిగినవి అడగనివి అలా ఆసువులా ప్రవాహంలా సాగిపోయింది నెల రోజులు.

మొదటిరోజే ఆయన వాగ్ధాటికి, చెప్పిన తీరుకు ముగ్ధులయిన ముగ్గురు అమెరికన్ స్నేహితులు, "మాతోపాటు మరికొంతమంది వస్తాం అంటున్నారు. తీసుకురావచ్చా" అన్నారు.

"మా డ్రాయింగ్‌రూంలో పట్టినంతమంది రావచ్చు" – వేణు జవాబిచ్చాడు. వేణు కూడా తండ్రి అంత అద్భుతంగా అందరికి అర్థమయ్యే రీతిలో అన్ని విషయాల గురించి మాట్లాడగలరని అనుకోలేదు. మర్యాదకి కాసేపు కూర్చుని లేచి పోదాం

అనుకున్న వేణు మొదటి రోజు మొదలు నెల రోజులు ముఖ్యశ్రోత అయిపోయాడు. పిల్లలిద్దరూ తాతగారేం చెబుతారోనని కూర్చుని కథలు చెప్పినంతసేపు ఆకర్షితులై, అర్థంకాని విషయాలొస్తే ఆడుకుందుకు వెళ్ళిపోయేవారు.

ఆ మర్నాడు పది పన్నెండు మంది ఆడ మగ అమెరికన్లు, ఈ పురాణ కాలక్షేపం విషయం విని ముగ్గురు నలుగురు తెలుగు, తమిళ, కన్నడ దంపతులు వచ్చి చేరారు.

మైఖేల్, జాన్, జాఫ్రీ రాంగానే వాళ్ళే సోఫాలని జరిపేసి, తివాచీల మీద అందరూ కూర్చునే ఏర్పాటు చేసి, వెళ్ళేముందు అన్నీ సర్దేసి వెళ్ళేవారు. పదిరోజులలో వారందరి దృష్టిలో కృష్ణశర్మ హీరో అయిపోయారు.

"ఏమిటో నేనిలా చెప్పగలుగుతానని ఎప్పుడూ అనుకోలేదు. మొదలుపెట్టగానే ఓదాన్లోంచి ఓ దాన్లోకిలా ఆసువుగా మాటలు దొర్లిపోతున్నాయి" అన్నారు ఆయన ఆశ్చర్యపోతూ.

"యూనివర్సిటీలో లెక్చర్ల అనుభవం వుందిగా నాన్నగారూ – లోకల్ షణ్ముఖశర్మ అయిపోయారు అమ్మా..." హాస్యం ఆడాడు వేణు.

"అవునురా వేణూ, మీనాన్నకిన్ని తెలుసని ఇంత బాగా చెపుతారని నేను అనుకోలేదు. ఏదో ఎంతసేపు నన్ను తిట్టడం, సాధించడం, కమ్మగా ఏపూటకాపూట వేడివేడిగా వండించుకుని సుష్టుగా భోంచేయడం తప్ప ఇన్ని వచ్చని తెలీదురా" – సగం ఆశ్చర్యం, సగం హాస్యం మేళవించి అంది వర్ధనమ్మ.

"అంతేమరి – పెరటి చెట్టు మందుకి పనికిరాదంటారు. మొగుడి విలువ ఇప్పటికన్నా తెలుసుకో" – కృష్ణశర్మ హాస్యం ఆడారు.

"పోనీలే నాన్నగారికింక తోచలేదన్న బెంగలేదీసారి – మన ఇండియాలో మన వేదాలు, పురాణాల గురించి పట్టించుకునేవారు లేరు. ఈ అమెరికన్లు మాత్రం శ్రద్ధగా మన వేదాలు, పురాణాల గురించి క్షుణ్ణంగా చదువుతున్నారు. వాళ్ళేం చేసినా క్షుణ్ణంగా శ్రద్ధగా చేస్తారు – మన యోగా, మెడిటేషన్, ఆయుర్వేదం ఇప్పుడింత పాప్యులర్ ఇక్కడ. వీళ్ళకిపుడు ఇదో క్రేజ్..."

"ఇప్పుడు మన ఇండియాలోనూ పూజలు, పునస్కారాలు ఎక్కువయ్యాయి మా చిన్నప్పటికంటె. ఇదివరకు గుళ్ళు, గోపురాలు, యాత్రలలో అంతా వయసుమీరిన వారే కనపడేవారు. ఇప్పుడు ఎక్కడ చూసినా యువతే – జీన్ పాంట్లేసుకుని అమ్మాయిలు, అబ్బాయిలు ప్రదక్షిణాలు చేస్తున్నారు –" – వర్ధనమ్మ అంది నవ్వుతూ.

"అవును మరి. ప్రతివాడికి కోరికలెక్కువయిపోయాయి. పాపపు పనులు ఎక్కువయ్యాయి. చేసిన పాపాలు కడుక్కోడానికి గుళ్ళచుట్టూ ప్రదక్షిణ చేస్తే చాలనుకుంటున్నారు. మర్డర్లు చేసేవారు పొద్దుటే బొట్టుపెట్టుకుని, అగరొత్తులు దేముడి పటానికి తిప్పేసి, బొడ్లో కత్తులు, కటార్లు, పిస్తోళ్లు దిగేసుకు బయలుదేరుతున్నారు" – కృష్ణశర్మ విరక్తిగా అన్నారు.

"బాగుంది – అది వాడి "దంధా' అన్నమాట" – హాస్యంగా అన్నాడు వేణు.

* * * * * *

"వేదభూమి అన్నపేరు ఎలా వచ్చింది? ఇండియాలోనే వేదాలు ఎందుకు పుట్టాయి?" – మైఖేల్ సందేహం బైటపెట్టారు.

"ఓసారి త్రిమూర్తులు ఈ వేదాలు ఎక్కడ పరిరక్షింపబడతాయి, ఎక్కడ ప్రచారం జరగాలి, మునులు, ఋషులు వేదాలు పఠించడానికి అనువైన ప్రదేశం కోసం అన్వేషించి అన్వేషించి ఆఖరుకి ఒక జంతువుని భూమ్మీదకి పంపి అది ఎక్కడ నడయాడుతుందో అదే తగిన చోటు అన్న నిర్ణయానికి వచ్చారు. ఆ జంతువు భూ ప్రపంచం అంతా తిరిగి ఇక్కడ ఆగింది. ఇదే అనువైన ప్రదేశం, ఋషులు, మునులు వేదపఠనాలు చేస్తూ, యజ్ఞ యాగాదులు చేసే భూమి యిదే వేదభూమి అనుకున్నారట."

ఆ వివరణకి అందరూ సంతృప్తిగా తలలాడించారు.

"కర్మ సిద్ధాంతం నమ్మాలా! చావు పుట్టుకల మర్మం అంతా భగవంతుని చేతిలో వుందని నమ్మాలా? భగవనిర్ణ ప్రకారమే జరుగుతాయా?" – జాన్ అడిగాడు ఓరోజు.

కృష్ణశర్మ నవ్వారు – "బాబూ అంత లోతుగా ఆలోచించి ఖచ్చితంగా చెప్పగలిగే జ్ఞానం లేదు నాకు. సైన్సు ఇంత వృద్ధిచెందినా చావు పుట్టుకల మర్మం ఇంకా మనిషి చేతిలోకి రాలేదు గదా. అంచేత సృష్టికర్త రహస్యం భగవంతుని చేతిలో వుందనే నమ్మాలి. దీనికి ఓ చిన్న కథ చెపుతా. ఓరోజు యమధర్మరాజు ఇంద్రుడితో పనిపడి ఇంద్రలోకం వచ్చాడట. లోపలికి వెళ్లబోతుంటే అతని దృష్టి అక్కడ చిన్న పురుగులో నూకలో ఏరుకుతినే చిన్న పక్షి మీద పడింది. యముడు కాస్త ఆశ్చర్యపడి, సాలోచనగా చూసి లోపలికి వెళ్లాడు. ఆ పక్కనే చెట్టుమీద వాలివున్న పెద్ద గద్ద అది చూసి యమధర్మరాజు పాపపు దృష్టి ఈ చిన్న ప్రాణిమీద పడింది. ఈ చిన్న పక్షిని కాపాడాలి అనుకుని, ఆ పిట్టని తన భుజాల మీద ఎక్కించుకుని వాయువేగంతో

కొన్ని యోజనాల దూరంలో ఓ పెద్ద అడవిలో ఓ చెట్టు తొర్రలో ఆ పక్షిని ఎవరికి కనపడకుండా దాచిపెట్టి వెళ్ళిపోయింది. యముడు పని ముగించుకుని బయటికి వచ్చి ఆచిన్న పక్షి కోసం అటు యిటు వెతికి చూసాడు. ఇంద్రుడు ఏం చూస్తున్నావని అడిగితే – 'ఇంద్రా, ఇందాక లోపలికి వస్తుంటే చిన్నపక్షి కనిపించింది. కొన్ని క్షణాలలో ఎక్కడో యోజనాల అవతల దానికి మరణం రాసిపెట్టి వుంటే ఈ సమయంలో ఇక్కడెందుకు వుందా అని ఆశ్చర్యపడ్డాను' అన్నాడు. అక్కడ ఆ చెట్టుతొర్రలో ఉన్న పాము పక్షిని చంపి తింది. అంటే అర్థం అయిందా మీకు – ఎక్కడో అది చావాల్సి వుంటే దానిని రక్షించి సాయం చేసానని అనుకొని దేగ దాని చావుకు కారణభూతురాలైంది. అంటే మృత్యువు ఎప్పుడు, ఎలా, ఎందుకు వస్తుందో తెలియదుకదా."

ఈ కథ విని అంతా ఆశ్చర్యానందాలతో చప్పట్లు కొట్టారు.

"గుడ్ గుడ్ ఎంత అద్భుతమైన సంఘటన. ఇంత చిన్నకథలో ఎంతటి భావం ఇమిడి ఉంది" – జెఫ్రీ అన్నాడు.

"గ్రహాల ప్రభావం మానవుల మీద ఎంత వుంటుంది? రోజులు బాగాలేవు, గ్రహాలు బాగాలేవు అంటారు. నిజంగా ఆ ప్రభావం వుంటుందా?" మరోరోజు మరొకరి సందేహం.

"సైన్సు ప్రకారం చూసినా నమ్మాలి కదా బాబూ! పౌర్ణమి, అమావాస్యలనాడు చంద్రగ్రహ ప్రభావం సముద్రంలో ఆటుపోట్లు ఎక్కువ అవుతున్నదని సైన్సు చెబుతుంది. సముద్రం మీదే ప్రభావం ఉన్నప్పుడు మనిషి మీద ఎందుకుండకూడదు – గ్రహస్థితిని బట్టి మంచి చెడులు జరుగుతున్నాయన్నది కొంతవరకు నమ్మాలేమో – ఇవన్నీ ఇంకా నిరూపింపబడలేదు. కాని దీనికి ఓ కథ చెపుతాను వినండి. అన్ని గ్రహాలలో శనిగ్రహానికి అందరూ భయపడతారు. శని పట్టిందంటే ఆ ప్రభావం చెడుగా ఎక్కువ, అపుడపుడు మంచి జరుగుతూందంటారు. ఓరోజు శనీశ్వరుడు తన ప్రభావం నించి మానవులే కాదు దేవతలూ తప్పించుకోలేరని సవాలు విసిరాడు. అది విని ఈశ్వరుడు నవ్వి... "నీ ప్రభావం నామీద చూపిస్తావా, నన్నేం చెయ్యలేవు" అని ఈశ్వరుడు ప్రతి సవాల్ విసిరాడట. 'సరే రేపు సూర్యోదయం నించి సూర్యాస్తమయంలోగా నా ప్రతాపం చూపిస్తాను –' అని శని నవ్వుతూ చెప్పి వెళ్ళిపోయాడు. శని నుంచి తప్పించుకోడానికి ఏం చెయ్యాలా అని ఆలోచించి

శివుడు అతనికి కనపడకుండా ఎక్కడో కొన్ని యోజనాల దూరంలో ఉన్న అడవిలో, ఓ చెట్టు తొర్రలోదాగి కూర్చున్నాడు రోజంతా. సూర్యాస్తమయం అయ్యాక తిరిగి కైలాసం చేరుకుని అప్పటికే అక్కడ వున్న శనిని చూసి నవ్వి, 'ఏది నన్నేం చెయ్యగలిగావు – ' అని సవాల్ విసిరాడు.

శని నవ్వి, 'పరమేశ్వరా మందిమాగధులతో సుఖంగా కైలాసంలో పార్వతీదేవితో ఉండాల్సిన నీవు ఎక్కడో అడవి చెట్టుతొర్రలో ఆకలి దప్పులతో రోజంతా గడపవలసి రావడం నా ప్రభావం కాదంటావా?' అని ఎదురు ప్రశ్నించేసరికి ఈశ్వరుడు తెల్లబోయి తలదించుకున్నాడు."

వింటున్న అందరూ చప్పట్లు కొట్టారు. పిల్లలిద్దరూ "తాతయ్యా, భలే కథ చెప్పావు" అన్నారు.

"నిజంగా ఈ కథలన్నీ మనకిన్ని విషయాలు చెపుతున్నాయి" – ప్రశంసగా అన్నాడు మైఖేల్.

"అదే బాబూ, మన పురాణ పురుషులు, మునులు, ఋషులు, పామరులకి సయితం అర్థం కావడానికి ఇలాంటి జీవిత రహస్యాలను కాచి వడబోసి కథలుగా తయారుచేసి మనకిచ్చారు. మా వేమన, సుమతి శతకాలు చిన్న పదాలలో ఎంత అనుభవం, ఎంత నీతి, ఎన్ని మానవతా విలువలు పొందుపరిచాయి. మా చిన్నతనంలో రోజుకో పద్యం కంఠతా పట్టించేవారు."

సుమతీశతకం, వేమనశతకాల పద్యాలు రోజుకి మూడు నాలుగు చదివి తాత్పర్యం చెపుతూంటే స్కూలు పిల్లల్లా విని అవి వారి భాషలో రాసుకుని మర్నాడు కంఠతాపట్టి వినిపించేవారి శ్రద్ధాసక్తులకు పొంగిపోయేరు కృష్ణశర్మ.

"మాకు గాయత్రి మంత్రం నేర్పరూ..." – మైఖేల్, జాఫ్రీ, ఇంకా నలుగురయిదుగురు అడిగారు.

"గాయత్రి మంత్రం పరమ పవిత్రమైంది. ఉపనయనం చేశాక నాన్నగారు దగ్గరుండి విధిగా ఉదయం గాయత్రి జపం చేయించేవారు. ఇందులో ఆధ్యాత్మికతపాటు ఆరోగ్య రహస్యమూ వుంది. ఉదయ సూర్యుడి లేత కిరణాలు శరీరానికి కావల్సిన 'డి' విటమిన్ అందిస్తుంది. దినం ప్రారంభానికి మనసు లగ్నంచేసి చేసే గాయత్రి జపం, మనసు నిర్మలంగా వుంచడంలో సాయపడ్తుంది. అంతేకాక 'ఓంకార' శబ్దంలో వచ్చే శబ్దతరంగాలు మెదడుని ప్రభావితం చేస్తాయి. మాట

ఉచ్చారణ మెరుగుపడ్తుంది. ఇపుడు గాయత్రితోపాటు, ప్రాణాయామమూ కలిపి ఒకేసారి చేస్తే సమయం కలిసి వస్తుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాల పట్ల నియంత్రణ ఏర్పడుతుంది" అంటూ ముందు కాగితం మీద గాయత్రి రాయించి, తరువాత ఊపిరి బిగబట్టి గాయత్రి మంత్రం జపించడం, ఊపిరి వదిలి, మళ్ళీ ఊపిరి బిగబట్టి గాయత్రి చేయడం పద్ధతి – ముక్కు మూసుకుని ఎలా చెయ్యాలో వివరించారు.

అందరూ ఆయన్ని అనుకరించి నాలుగైదుసార్లు చేశారు.

"రోజుకి ఐదారుసార్లతో ప్రాణాయామం ఆరంభించి గాయత్రి 108 సార్లు జపించాలి. కనక రోజు రోజుకి పెంచుకుంటూపోతే ఉచ్ఛ్వాసనిశ్వాసాల మీద మీకు ఎంతో నియంత్రణ వచ్చి ఆరోగ్యం బాగుపడ్తుంది."

"సార్ మీరు ఇంత గొప్పగా విడమర్చి, మాకు అర్థమయ్యే భాషలో, చెప్పబట్టి మాకు అన్ని వివరంగా తెలుస్తున్నాయి. మీ పురాణాలలో గొప్పతనం, నీతి చదివిన దానికంటె సహేతుకంగా, విమర్శనాపూర్వకంగా మా సందేహాలు తీర్చారు... మీ నోట నీతినియమాలు, ఆచారవ్యవహారాల వెనుక ఉన్న నిగూఢార్థాలు తెలిసేయి" – అందరూ ముక్తకంఠంతో అన్నారు.

"దాందేముందిలే బాబూ, నాకు తెలిసినది నలుగురితో పంచుకున్నాను. నేను చెప్పిన వాటిల్లో నా నిర్వచనం చెప్పాను. అది సరి అయిందో కాదో తెలియదు. ఈనాడు పిల్లలకి మంచి చెడ్డ, నీతి అవినీతి, పాపం పుణ్యం గురించి కథలుగా చెప్పి వారి మానసిక వికాసానికి తోడ్పడడం మీలాంటి యువత చెయ్యాలి. సమాజంలో పెరిగిపోతున్న హింస, దౌర్జన్యం, విధ్వంసాలు పెరిగిపోతున్న తరుణంలో పసి మనుసులలో చిన్నప్పటినించి పాపభీతి కలిగించాలి. మన శతకాలు, నీతి కథలు విరివిగా చెప్పి దయ, క్షమాగుణాలు పెంచాలి. మన సంస్కృతి మనకిచ్చిన వరాలు భావితరాలకి చెప్పవలసింది మీరే. ఈ కంప్యూటర్ యుగంలో సమయం తీసుకుని మీ పిల్లలని సన్మార్గంవైపు నడిపిస్తే అదే నాకు మీరిచ్చే నిజమైన గురుదక్షిణ –" అన్నారు ఆవేశంగా. అందరూ ఆయనతో ఏకభవిస్తూ తలలూపారు.

* * * * * *

మర్నాడు ఉదయం ఆరుగంటలకి కృష్ణశర్మ స్నానంచేసి గాయత్రికి కూర్చోగానే వేణు స్నానం చేసి పట్టుపంచె కట్టుకుని తండ్రి దగ్గరికి వచ్చి కూర్చున్నాడు.

"నాన్నగారూ ఇవాళ నించి నేను గాయత్రి చేస్తాను. ఒకసారి అంతా సరిగా చెప్పి, ప్రాణాయామం చూపించండి –" అన్నాడు.

కృష్ణశర్మ మొహంలో వెలుగు.

శరత్ పరుగెత్తుకుని వచ్చి, "నేనూ స్నానం చేశాను. నాకూ గాయత్రి చెప్పండి తాతగారూ" అన్నాడు.

"ముందు ఉపనయనం అవాలి నాన్నా, ఆతరువాత మీ నాన్న నీకు చెపుతాడు లేరా!"

"అలా అయితే ఇప్పుడే ఉపనయనం చేసేయండి."

వేణు నవ్వి, "నాన్నగారూ జనవరి తరువాత మంచి ముహూర్తం చూసి చెప్పండి, వీడికి వడుగు చేద్దాం."

కృష్ణశర్మ ఆనందంగా తల ఊపారు.

* * * * * *

ఆరాత్రి కూతురింటికి హ్యూస్టన్ ప్రయాణం. అక్కడ నెల రోజులుండి ఇండియా ప్రయాణం. ఆ రోజు ఆదివారం.

ఉదయం శిష్యులందరూ వచ్చి అందరూ గురువుగారికి పాదాభివందనం చేసి, పూలమాలలు వేసి, శాలువ కప్పి పేరు పేరునా కృతజ్ఞతలు చెప్పి ఆఖరున అందరూ కలిసి ఆయన చేతికి ఓ కవరు అందించారు.

"ఏమిటిది?" - కృష్ణశర్మ కవరు తెరుస్తూ అడిగారు.

డాలర్లు... నోట్లు!

మైఖేల్ ముందుకు వచ్చి వినయంగా, "చాలా చిన్న గురుదక్షిణ. అందరం కలిసి మా సంతోషం కోసం ఇస్తున్నదాన్ని మీరు కాదనకండి" అన్నాడు.

కృష్ణశాస్త్రి నవ్వి నోట్లు లెక్కపెట్టారు. ఐదువేల డాలర్లు. మళ్ళీ నోట్లు కవరులో పెట్టి మైఖేల్‌కి అందించి, "వద్దు బాబూ, ఏదన్నా డబ్బుతో విలువకడితే దాని ప్రభావం పోతుంది - విలువ తగ్గుతుంది. నాకు కృతజ్ఞతలు చూపాలంటే నేను చెప్పినవి మీ పిల్లలకు నేర్పండి - మన సంస్కృతి, మన విలువలు ఆచరించినపుడు దొరికే ఆనందం ముందు ఈ డబ్బు విలువ ఏపాటి" అంటూ నమస్కారం చేశారందరికి.

"కాని మా సంతోషం..." - ఏదో చెప్పబోయారు కొందరు.

ఆయన చేత్తో వారిస్తూ, అంతలోనే ఏదో గుర్తువచ్చినట్టు మైఖేల్ చేతిలో కవరందు కున్నారు.

వేణు తెల్లబోయాడు.

కృష్ణశర్మ అందరి వంక తిరిగి, "ఈడబ్బు నేను తీసుకుంటాను. మీరందరూ అంగీకరిస్తే ఓ మంచి పనికి వినియోగిద్దామన్న ఆలోచన వచ్చింది నాకు. ఇండియాలో సంస్కృత పాఠశాలల్లో చదవడానికి ముందుకొచ్చే బీదవిద్యార్థులకి స్కాలర్‌షిప్‌లు ఇచ్చి చదివిస్తాను. మన సంస్కృతం బతికించుకుందాం. అందువల్ల వేదాన్ని రక్షించుకుందాం. మన వేదభూమిని ముందు తరాలవారికి మిగిల్చి అప్పగిద్దాం. ముందు తరాల వారికి వేదాల పాఠాలని చెప్పే సంస్కృత పండితులని తయారు చేయడానికీ డబ్బు ఉపయోగిద్దాం! ఏమంటారు?"

అందరూ సంతోషంగా చప్పట్లు కొట్టారు.

"మీరాపని చెయ్యడానికి ముందుకువస్తే మేము చందాలు పోగు చేసి ప్రతి సంవత్సరం పంపిస్తాం" - మైఖేల్, జాన్, జాఫ్రి... ముందుకు వచ్చి వినయంగా నమస్కారం చేసి అన్నారు.

"తప్పకుండా నేను ఉన్నన్ని రోజులు ఆ బాధ్యత నేను తీసుకుంటాను" - మనస్ఫూర్తిగా అన్నారు కృష్ణశర్మ.

*(రచన, డిసెంబరు, 2011)*